క్లుప్తంగా

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్నికల ప్రచారం



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి గోపీమూర్తి

కపిలేశ్వరపురం: ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపీమూర్తి గురువారం మండలంలోని కపిలేశ్వరపురం, అంగర, వాకతిప్ప, టేకి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిసెంబర్ 5న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ లక్ష్య సాధనలో భాగంగా పీడీఎఫ్ విశేష కృషి చేస్తుందన్నారు. పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపు యావత్ ప్రజాస్వామిక శక్తుల గెలుపు అని అభివర్ణిస్తూ తనకు ఓటు వేయాలని గోపీమూర్తి అభ్యర్థించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

రామచంద్రపురం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో పీడీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొర్రా గోపీమూర్తి గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పలు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడి తనకు మద్దతు ఇచ్చి ఉప ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు.

దౌర్జన్యంగా బుక్‌స్టాల్ తొలగింపు

మండపేట: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల వద్ద రోడ్డు పక్కన బతుకుతెరువు కోసం బడ్డీ కొట్టులో బుక్‌స్టాల్ ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్న పట్టణంలోని దళిత కుటుంబీకురాలు పెనుముచ్చి సుమలత బడ్డీని మున్సిపల్ అధికారులు నిర్దాక్షిణ్యంగా తొలగించారు. గురువారం మున్సిపల్ అధికారులు పారిశుధ్య కార్మికులను తీసుకెళ్లి బుక్‌స్టాల్‌ను పనిముట్లతో బయటకు లాగేసి వాహనంలో మున్సిపల్ కార్యాలయానికి తరలిస్తుండగా బాధితురాలి తండ్రి పెనుముచ్చి సుకుమార్ అడ్డుకున్నారు. అక్కడ ఉన్న పట్టణ ప్రణాళిక అధికారి శ్రీధర్‌ను ఎందుకు చెప్పకుండా తన కుమార్తె బుక్‌స్టాల్‌ను తొలగిస్తున్నారని అడిగారు. కమిషనర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకున్నామని టీపీవో చెప్పినట్టు సుకుమార్ తెలిపారు. ఎవరికీ అడ్డంగా, ఇబ్బంది గానీ కలిగించకుండా పాఠశాలల విద్యార్థులకు అవసరమైన సామగ్రి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న తన కుమార్తె పొట్ట కొట్టారని సుకుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులు తమపై కావాలని కక్షపూరితంగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ మీటర్ల తనిఖీ

రాయవరం: మండలం చెల్లూరులో గృహ, వాణిజ్య వినియోగదారుల మీటర్లను విద్యుత్‌శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు రాయవరం విద్యుత్ ఉపకేంద్రం ఇంజినీర్ సందక శ్రీనివాసులు మాట్లాడుతూ మండపేట విద్యుత్ సర్కిల్ పరిధిలోని 351 విద్యుత్ సర్వీసులను తనిఖీ చేయగా రెండు సర్వీసుల్లో అక్రమ విద్యుత్ వినియోగం, మూడు సర్వీసుల్లో అదనపు లోడ్, 55 సర్వీసులకు అదనపు డిపాజిట్ కట్టాల్సిన 55 గృహవినియోగసర్వీసులను గుర్తించామన్నారు. 50 మంది సభ్యులతో 14 బృందాలు గ్రామంలో తనిఖీలు చేపట్టాయన్నారు. 60 కేసుల్లో సుమారు రూ.2 లక్షలు వినియోగదారులు విద్యుత్ శాఖకు చెల్లించాలన్నారు. గృహవినియోగ సర్వీసుల్లో అదనపు వాడకానికి డిపాజిట్ సొమ్ము కట్టాల్సి ఉందన్నారు. గ్రామాల్లో సర్వీసులను క్రమబద్ధీకరించేందుకు తనిఖీ నిర్వహించనున్నామని ఏఈ తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కాజులూరు: సాగులో రైతులు మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టినప్పుడే అధిక దిగుబడులు సాధించవచ్చని జేడీఏ ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. గురువారం శీలలో మండల వ్యవసాయాధికారి వి.అశోక్ ఆధ్వర్యంలో జరిగిన పొలంబడి ముగింపు కార్యక్రమంలో జేడీఏ విజయ్‌కుమార్, కరప ఏడీఏ కె.బాబూరావు తదితరులు పాల్గొని ఎరువుల యాజమాన్యంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి నాణ్యతతో కూడిన అధిక దిగుబడులు సాధించడమే లక్ష్యంగా పొలంబడులు నిర్వహిస్తున్నారన్నారు. అధిక ఎరువుల వినియోగం వీడి ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. సర్పంచ్ కోమలి వెంకటరమణ, రైతు సంఘాల నాయకులు నల్లమిల్లి రామారెడ్డి, గరగ కొండలరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

రామచంద్రపురం రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం రామచంద్రపురం సమగ్ర శిశు సంక్షేమ అధికారి వి.వరాహలక్ష్మికి సిబ్బంది వినతి పత్రం అందజేశారు. యూనియన్ రామచంద్రపురం ప్రాజెక్టు కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ మాట్లాడుతూ అంగన్‌వాడీ ప్రీ స్కూల్స్‌ను బలోపేతం చేయాలని, దీనికోసం ఐసీడీఎస్‌లకు నిధులు పెంచాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు సాయంత్రం వేళల్లో స్నాక్స్ అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు నిర్మించాలని తదితర డిమాండ్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పి.చంద్రకళ, జి.వెంకటరత్నం, వి.సూర్యకుమారి, వి.లక్ష్మీరత్నం, కె.దుర్గ, జహీరా తదితరులు పాల్గొన్నారు.

ఊగుతూ.. తూగుతూ..

- ప్రతి ఊరులో బెల్టు షాపుల జోరు
- పుట్టగొడుగుల్లా దుకాణాలు



పామర్రులో మద్యం దుకాణం వద్ద ఉదయం 9 గంటలకే విక్రయాలు

కె.గంగవరం: మద్యం మత్తులో ప్రతి ఊరూ ఊగుతూ.. తూగుతోంది. రా రమ్మని పిలిచేలా ముంగిటనే మద్యం దుకాణం వెలసింది.. దీనికి తోడు బెల్ట్ షాపూ వచ్చేసింది. గ్రామాల్లో బెల్ట్ షాపులు లేకుండా చూస్తాం... ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కూటమి ప్రభుత్వ పెద్దలు, ఎక్సైజ్ అధికారులు నిత్యం చెబుతున్నా క్షేత్ర స్థాయిలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది. ప్రైవేట్ మద్యం దుకాణాలు ఏర్పాటైన తర్వాత అధికార పార్టీ అండతో గ్రామాల్లో విచ్చవిడిగా గొలుసు దుకాణాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. కూటమి నేతల ఒత్తిడితో అధికారులు పట్టించుకోవడం లేదనే విషయం అందరికీ తెలిసిందే. గ్రామాల్లో 24 గంటలూ మద్యం అందుబాటులో ఉంటుంది.

కూటమి ప్రభుత్వం వచ్చాక మద్యం పాలసీని మార్చింది. దీంతో ప్రైవేట్ మద్యం షాపులు తెరుచుకున్నాయి. ఈ నేపథ్యంలో రామచంద్రపురం నియోజకవర్గంలో ఊరూరా బెల్టు షాపుల్లో మద్యం అమ్మకాలు సాగుతున్నారు. గ్రామాల్లో వాటర్ ప్లాంట్ లేని పల్లెలు అక్కడక్కడా ఉన్నాయని, బెల్టు దుకాణాలు లేని ఊరు లేదని మహిళలు మండిపడుతున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలోని కె.గంగవరం, రామచంద్రపురం రూరల్, కాజులూరు మండలాల్లో సుమారు 14 ప్రైవేట్ మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటికి అనుబంధంగా ప్రతి గ్రామంలో బెల్టు షాపులు వెలిశాయి. కె.గంగవరం మండలంలో కోటిపల్లి, కూళ్ల, మల్లవరం, తామరపల్లి, కె.గంగవరం, కుందూరు, మసకపల్లి, యర్రపోతవరం, మసకపల్లి, భట్లపాలిక గ్రామాల్లో బెల్టు షాపులు వెలశాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉండడంతో ఎక్కడా గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించలేదు. అయితే కూటమి ప్రభుత్వంలో ప్రైవేట్ దుకాణాలను దక్కించుకున్న వ్యాపారులు విచ్చలవిడిగా బెల్టు షాపులకు తెరలేపారు. డిమాండ్‌ను బట్టి ఒక్కో షాపు వద్ద ఒక్కో రకంగా సొమ్ము వసూళ్లు చేశారు. బెల్టు షాపుల వద్ద ఎమ్మార్పీ కంటే రూ. 30 నుంచి రూ.60 వరకు అదనంగా వసూలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు.

ఉదయం 8 గంటలకే..

లైసెన్సు ఉన్న మద్యం షాపుల వద్ద నిబంధనల ప్రకారం వాస్తవానికి ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం విక్రయించాలి. అయితే కె.గంగవరం మండలంలో ఉదయం 8 గంటలకు షాపులు తెరుచుకుంటున్నాయి. కొన్నిచోట్ల ఉదయం 9 గంటలకే మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మద్యం కూటమి నేతల సిఫార్సులతో వాటిని పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో పాటు బిర్యాని, ఫాస్టుఫుడ్ సెంటర్ల వద్ద అనుమతి లేకపోయినా మద్యం తాగిస్తున్నారని కొందరు వాపోతున్నారు. ఇప్పటికైనా వీటిని అధికారులు దృష్టి సారించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

బెల్టు షాపులను ఎత్తివేయాలి



గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు వెలిశాయి. తెల్లవార్లూ మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బెల్టు షాపులను ఎత్తివేయాలి. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉండేది. ఇప్పుడు మాత్రం బహిరంగంగానే అమ్మకాలు జరుగుతున్నాయి.

–కొప్పిశెట్టి లక్ష్మణ్, ఎంపీటీసీ సభ్యుడు, దంగేరు

అధికారులు పట్టించుకోవాలి



కూటమి ప్రభుత్వం బెల్టు షాపులను తీసేయాలని ఆదేశాల జారీ చేసింది. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో యథావిధిగా గ్రామాల్లో బెల్టు షాపుల్లో మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. మద్యం బయట పెట్టి మరీ బహిరంగంగానే అమ్మకాలు చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణం. ఇప్పటికైనా స్పందించి షాపులను తొలగించాలి.

–మేడిశెట్టి ఇజ్రాయేల్, మసకపల్లి

కాజులూరులో కలెక్టర్ పర్యటన



గొల్లపాలెం పీహెచ్‌సీలో సేవలపై ప్రశ్నిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

కాజులూరు: కాజులూరు మండల గ్రామాల్లో బుధవారం కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి బాలుర, బాలికల టాయిలెట్స్ నిర్వహణ, నాడు–నేడు ద్వారా నిర్మించిన తరగతి గదులు, మధ్యాహ్న భోజనం వండే షెడ్లు, ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. ఈ ఏడాది పాఠశాల నుంచి నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికైన విద్యార్థులను, జాతీయ స్థాయి క్రీడలలో రాణిస్తున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం చేదువాడ, బంధనపూడి, గొల్లపాలెంలలో రక్షిత తాగునీటి పథకాలను పరిశీలించి గొల్లపాలెం పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య కేంద్రం ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఫార్మసీ విభాగం, లెబోరేటరీలను, పీహెచ్‌సీ పరిసరాలను చూశారు. పీహెచ్‌సీలో జరుగుతున్న ప్రసూతి వైద్య సేవలపై వైద్యాధికారి సూజన్య, డాక్టర్ సీవీఎల్ శ్రేయలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో భారీ రక్షిత మంచినీటి పథకం నిర్వహణపైనా సిబ్బందిని ప్రశ్నించారు. కాకినాడ జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కేవీ సుబ్బారావు, ఎంపీడీఓ రాంబాబు, నాడు–నేడు డీఈ వెంకటరాజు, ఎంఈఓ డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థాలు



సదస్సులో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

రామచంద్రపురం: మత్తు పదార్థాల వినియోగంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని రామచంద్రపురం సీఐ కడియాల అశోక్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎ.శ్రీనివాస్ అధ్యక్షతన సదస్సు జరిగింది. అశోక్‌కుమార్ మాట్లాడుతూ యువత డ్రగ్స్‌ను తరమికొట్టేందుకు నడుం బిగించాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని ఆ దిశగా తమ జీవితాలను తీర్చిదిద్దుకోవాలన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై.పద్మజ, సీనియర్ అధ్యాపకులు ఎన్వీ రమా, బి.రవికుమార్, వెంకటేశ్వర్లు, సొజాది బేగం తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్‌కు బంగారు బాట వేయాలి



కపిలేశ్వరపురం పాఠశాలలో వివిధ వేషధారణలతో విద్యార్థులు



విద్యార్థులకు బహుమతులు అందించిన జీవీ రావు

కపిలేశ్వరపురం: బాలల భవిష్యత్‌కు బంగారు బాట వేసే దిశగా ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలని జాతీయ బాలల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాలయాల్లో గురువారం బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు పర్యవేక్షణలో చిన్నారులు జాతీయ నాయకుల వేషధారణలో అలరించారు. ఎంఈఓ కె.తాతారావు, పాఠశాలల ఉపాధ్యాయులు మాట్లాడుతూ స్వాతంత్ర్యానంతరం నెహ్రూ జాతీయ, అంతర్జాతీయ విధానాలతో భారతదేశం ప్రగతి బాట పట్టిందన్నారు. చిన్నారుల్లో నైతిక విలువలను పెంపొందించడం ద్వారా భావి భారతావని ప్రపంచ పటంలో తన ప్రతిష్ఠను మరింత ఇనుమడింపజేసుకోగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. అంగర, తాతపూడి, కపిలేశ్వరపురం, పడమర ఖండ్రిక, వల్లూరు, వెదురుమూడి, నేలటూరు, అచ్యుతాపురం, నిడసనమెట్ట, తదితర గ్రామాల్లో బాలల దినోత్సవాన్ని వైభవంగా జరుపుకొన్నారు.

మండపేట: చిన్నారులపై ప్రేమానురాగాలు చూపించి చాచా నెహ్రూగా పిలవబడే భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలు నేటి బాలలకు స్ఫూర్తిగా నిలవాలని మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు అన్నారు. మండలంలోని ఏడిద మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు గెడా శ్రీనివాస్, ఉపాధ్యాయులు పి డేవిడ్ రా, వివిపి ప్రసాద్, బిఎస్వీఎల్ చైతన్య, చిన్నారులు పాల్గొన్నారు.

మండపేట: దేశ తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పట్టణంలో ఏడిద రోడ్డులో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. ఏఐసీసీ సభ్యుడు కామన ప్రభాకరరావు సూచనల మేరకు కొండ దుర్గారావు, ముగ్గుళ్ల శ్రీను ఇతర నాయకులు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. సలీం, అలమండ మణికంఠ, కె.సత్తిబాబు, ఎం.రాజు, కుచ్చు బాబి, పి.అప్పన్న, ఎస్.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రామచంద్రపురం: చాచా నెహ్రూ జయంతిని పురస్కరించుకుని గురువారం ఏబీసీ మోడరన్ ప్రైమరీ స్కూల్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోడరన్ అధినేత లయన్ జీవీ రావు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని చాచా నెహ్రూ సందేశం ఇచ్చారన్నారు. అనంతరం అకడమిక్ డైరెక్టర్ ఎ.రమాదేవి మాట్లాడుతూ భారతదేశ తొలి ప్రధానిగా నెహ్రూ అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు జీవీ రావు బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ శాఖా గ్రంథాలయంలో చిన్నారులకు వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు కె.వీరభద్రారెడ్డి, గ్రంథాలయ అధికారి ములంపాక వీర సూరిబాబు మాట్లాడారు.

ఆవు, ఆబోతులకు కల్యాణం

కె.గంగవరం: పాణింగపల్లిలో గురువారం ఆవు, ఆబోతులకు మాజీ ఎంపీటీసీ వైట్ల సూర్యకుమారి, రామారావు దంపతుల ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. సర్పంచ్ చీకట్ల సునీత గోపాలం, సొసైటీ మాజీ అధ్యక్షుడు వైట్ల అచ్యుతరామయ్య హాజరయ్యారు.

పంటు ప్రయాణం ప్రారంభం

కె.గంగవరం: మూడు నెలలుగా నిలిచిపోయిన కోటిపల్లి– ముక్తేశ్వరం మధ్య పంటు ప్రయాణం గురువారం ప్రారంభమైంది. దీంతో ప్రయాణ భారం తగ్గుతుందని ప్రయాణికులు సంతోషిస్తున్నారు. ఆదివారం లోపు పూర్తి స్థాయిలో పంటు ప్రయాణాన్ని ప్రారంభిస్తామని నిర్వాహకులు చెప్పారు.

ఇసుక అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు

కె.గంగవరం: అనుమతి లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ బండి మృత్యుంజయరావు హెచ్చరించారు. కోట వద్ద బొండు ఇసుక తరలిపోతుందని వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో గురువారం రేవును ఆయన పరిశీలించారు. ఆర్ఐ వెంకట్రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శివ పంచాక్షరి గ్రంథ ప్రతిష్ఠ

కపిలేశ్వరపురం: అంగరలోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం శివ పంచాక్షరి గ్రంథ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రాలతో పంచకోటి అక్షర గ్రంథాలతో ఆలయంలోకి ప్రవేశించారు. వేదపండితుల పర్యవేక్షణలో ఏకాదశి రుద్రాభిషేకం పూజలు చేశారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి సత్కారం



డాక్టర్ సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న పీఎంపీలు

మండపేట: ప్రపంచ మధుమేహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణుడు సబ్బెళ్ల సూర్యనారాయణరెడ్డిని కమ్యూనిటీ పారామెడిక్స్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. మధుమేహ దినోత్సవం సందర్భంగా అసోసియేషన్ సభ్యులు కోన సత్యనారాయణ, బల్లా వెంకటరమణ, వానపల్లి కనకరాజులు గుమ్మిలేరు రోడ్డులోని ఆయన నివాసానికి వెళ్లి డాక్టర్ సూర్యనారాయణరెడ్డికి శాలువా కప్పి వైద్య శాస్త్ర పుస్తకాన్ని జ్ఞాపికగా అందించారు. తొలుత ఇన్సులిన్ కనుగొన్న ఫెడరిక్ బాంటింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పుత్సల కాశీ, గాలింకి నాగేశ్వరరావు, ఇరవాడ ఏడుకొండలు, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

108 సిబ్బంది సమ్మె నోటీసు



రామచంద్రపురం ఎంపీడీఓ పద్మజ్యోతికి సమ్మె నోటీసు అందజేస్తున్న 108 సిబ్బంది

రామచంద్రపురం రూరల్: ఈ నెల 25 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు ఏపీ 108 సర్వీసెస్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం రామచంద్రపురం ఎంపీడీఓ కడలి పద్మజ్యోతికి సమ్మె నోటీసు అందజేశారు. సుదీర్ఘకాలంగా సమస్యలు పరిష్కరించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకు వెళుతున్నట్లు ప్రకటించారు. ప్రతి నెలా జీతాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతున్న కారణంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నామన్నారు. 108 వ్యవస్థలో నిర్వహణా సంస్థలను మార్పు చేసిన ప్రతిసారీ ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. వేతన స్లాబ్‌లను అప్డేట్ చేయాలని, తెలంగాణ రాష్ట్రంలో మాదిరిగా ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో చేపట్టే నియామకాల్లో 108 సిబ్బంది వెయిటేజీ ఇవ్వాలని, అంబులెన్స్‌లకు మరమ్మతులు చేపట్టాలని తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓకు అందజేశారు. విధులకు ఆటంకం కలగకుండా ఎన్ని నిరసనలు చేపట్టినా ప్రభుత్వంలో చలనం రాని కారణంగా ఈ నెల 25 నుంచి సమ్మెకు వెళుతున్నట్లు ప్రకటించారు. యూనియన్ సభ్యులు కట్టా భీమశంకరరావు, పంపన సత్యనారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు

రామచంద్రపురం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ రాజ్, రూరల్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26 తయారీపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, మండల స్థాయి అధికారులు, మండల కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ సీఈఓ వీవీవీ లక్ష్మణరావు ముఖ్య అతిథిగా పాల్గొని జీపీడీపీ తయారీలో తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. శిక్షణ తరగతుల రిసోర్సు పర్సన్లు వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, సుందర్‌లాల్, పి.సత్యనారాయణ, ఎ.వెంకటేష్‌లు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీఓ కడలి పద్మజ్యోతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎ.శాంతి, ఏఓ చాగంటి చాగంటి వెంకట అచ్యుతరామ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ ఎస్.సెలత్ రాజు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రభుత్వ శాఖల అధికారులకు అవగాహన అవసరమని ఎంపీడీఓ కె.రత్నకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రణాళికపై పలు ప్రభుత్వ శాఖల అధికారులకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఆర్ఎంవీవీఎన్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్ల పంపిణీ

మండపేట: జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి పుట్టినరోజు సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. 24వ వార్డు కౌన్సిలర్ జొన్న పల్లి విజయలక్ష్మి సత్తిబాబు దంపతుల ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో పట్టాభి జన్మదినోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. తొలుత నాళం వారి వీధిలో ఉన్న వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాధాకృష్ణ (రాజబాబు) కార్యాలయంలో కేక్ కటింగ్ చేశారు. అనంతరం విజలక్ష్మి దంపతులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వార్డుల్లోని రోగులకు, బాలింతలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అదేవిధంగా వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీపీ వుండమట్ల వాసు, రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు కొమ్ము రాంబాబు ఇతర నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

21న కార్తిక వన సమారాధన

రామచంద్రపురం: రామచంద్రపురం శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 21న కార్తిక వన సమారాధన నిర్వహించనున్నట్లు శెట్టిబలిజ సంఘం నేతలు తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గంలోని పలువురు ప్రముఖులను వారు కార్తిక వన సమారాధనకు ఆహ్వానం పలికారు. ఇందులో భాగంగా ప్రముఖ వైద్యుడు యనమదల మురళీకృష్ణకు కార్తిక వన సమారాధన ఆహ్వాన పత్రాన్ని గురువారం సంఘం నేతలు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ చింతపల్లి నాగేశ్వరరావు, కౌన్సిలర్ కేతా శ్రీను, నాయకులు నున్నబోయిన ప్రసాద్, దొంగల శ్రీధర్, కోట శ్రీను, గుత్తుల వీరన్నశెట్టి, దంగేటి గౌరీశంకర్, యనమదల వెంటరమణ, నరాల సురేష్, జుత్తుగ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం తప్పనిసరి

రామచంద్రపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలకు జమ అయ్యేందుకు తప్పనిసరిగా ఆధార్‌తో అకౌంట్‌ను అనుసంధానం చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపాలిటీ సచివాలయ పరిధిలో 500 చొప్పున మొత్తం 6 వేల మంది తమ బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలకు ఆధార్ లింక్ చేయించుకోవాల్సి ఉందన్నారు. ప్రతి సచివాలయం వద్ద వార్డు వెల్ఫేర్, డెవలప్‌మెంట్ సెక్రటరీలు, పోస్టాఫీసు సిబ్బంది ప్రత్యేకంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ లబ్ధిదారుల ఖాతాలకు ఆధార్ లింక్ చేస్తున్నారని తెలిపారు. కాగా ఖాతాలు లేని వారికి పోస్టాఫీసు సిబ్బంది ఖాతాలను కూడా తెరచి ఆధార్ లింక్ చేస్తున్నారని వివరించారు.

ఉచిత దంత వైద్య శిబిరం

రామచంద్రపురం రూరల్: అంబికపల్లి అగ్రహారం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ద్రాక్షారామ భీమేశ్వర దంత వైద్యశాల ఆధ్వర్యంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ బచ్చు క్రాంతికుమార్ విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కల్పించారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



మండపేటలో చిత్రలేఖన పోటీలను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు



కాజులూరులో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంపీడీఓ రాంబాబు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో మాట్లాడుతున్న ఎంఈఓ

మండపేట: 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని వారం రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు గురువారం మండపేటలో ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రంథాలయ అధికారి ఎస్.పూర్ణమ్మ ఆధ్వర్యంలో వారోత్సవాలు సందర్భంగా తొలిరోజు బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎస్వీఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 136వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం, సరస్వతీదేవి చిత్రపటాలు ఉంచి పూలమాలలు నమస్కరించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రవికుమార్ మాట్లాడుతూ నెహ్రూ జీవిత చరిత్రను తెలియపరిచారు.

మండపేట: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని మారేడుబాకలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ సారథ్యంలో కళాశాల ఆవరణలో గురువారం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ పితామహుడు ఖరంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి అధ్యాపకులు ఘన నివాళులు అర్పించారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని తెలిపారు.

కపిలేశ్వరపురం: సామాజిక ప్రగతికి పుస్తకమే మార్గదర్శి అని 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న ప్రముఖులన్నారు. కపిలేశ్వరపురం గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో గురువారం గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఎంఈఓ కె.తాతారావు, హైస్కూల్ హెచ్ఎం వంగా శ్రీనివాస్, సామాజిక కార్యకర్తలు చిట్టూరి సత్యనారాయణ, నాగేంద్ర ప్రసాద్, సచివాలయ ఉద్యోగి సతీష్ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఎంత ఆవిష్కృతమైనా పుస్తకం ఆవశ్యకత ఎప్పుడూ ఉంటుందన్నారు. గ్రంథాలయాధికారి శివకుమారి మాట్లాడుతూ ఈ నెల 20వ వరకూ నిర్వహించనున్న వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు ప్రతిభా పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన

కాజులూరు: పుస్తక పఠనంతో విజ్ఞాన సముపార్జన సాధ్యమని ఎంపీడీఓ రాంబాబు అన్నారు. కాజులూరు శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయాధికారి కె.ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ఎంపీఓ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రంథాలయాధికారి కె.ప్రసాద్ మాట్లాడారు.

రామచంద్రపురం: ఆరోగ్యకరమైన విజ్ఞానం దొరికే ఏకైన చోటు గ్రంథాలయమని వీఎస్ఎం డిగ్రీ అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎస్ ఆలీ అన్సారీ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను కళాశాల గ్రంథాలయ ప్రాంగణంలో ఆయన ప్రారంభించారు. అయ్యంకి వెంకటరమణయ్య పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కళాశాల వైస్ చైర్మన్ ఎంఎస్ఎన్ మూర్తి, లైబ్రేరియన్ చిట్టూరి రామకృష్ణ, కేవీవీ చౌదరి, డాక్టర్ ర్యాలి శ్రీనివాస్, డి.శ్రీనివాస్, ఎస్ఎల్ఎన్ మల్లిక, ఎ.చంద్రావతి పాల్గొన్నారు.